
మ్యాజెర్మీ కథల పోటీలో 150 రూ॥ లు బహుమతి పొందిన కథ




"తీర్థం తీసుకుందురు గానిరండర్రా!" అంటూపిలిచింది సావిత్రమ్మ.

నోము కోసం వచ్చిన పెద్ద కూతురు అరుణ, పిల్లలు; డిగ్రీ చదువుతున్న రెండవ కూతురు కరుణ, ఉద్యోగరీత్యా ఇక్కడ వుంటున్న మరిదిగారిఅమ్మాయి లక్ష్మి, కొత్తకోడలు ఉమ ఒకరి తరువాత ఒకరు వచ్చి తీర్థం తీసుకుని వెడుతున్నారు.

ఆఖరున వచ్చిన ఉమకి చేతిలో తీర్థం పోస్తూ, ఆరాగా చేతివంక చూసి "ఏమ్మా! ఉంగరం తీసి దాచావా?" అన్నారు.

"లేదండీ! అరుణొదినగారికి ఇచ్చాను. తీసుకుంటాను."

గుమ్మందాటి వెళ్ళబోతున్న అరుణ, "అరె, నేను నీకు తిరిగి ఇచ్చేశాగా, నూతి దగ్గర" గాబరాగా అంది.

"ఊహూ! నేను చేతి రుమాళ్ళకి సబ్బు పెడుతున్నాను. అసలే వదులుగా వుంది, జారిపోతుందేమో అని తరువాత తీసుకుంటాను మీ దగ్గరే వుంచండి అన్నాను కదా!" అంది ఉమ బిడియంగా.

"నీకివ్వలేదా!" ఆశ్చర్యపోయింది. గుర్తుచేసుకుంటూ, "నేను మావారికి చూపించి నీ దగ్గరకు తీసుకొచ్చాను. నువ్వు నూతి దగ్గర వున్నావు. అవును, నువ్వు వుంచమన్నావు. మరి నేను ఎవరికిచ్చాను? ఆ ! లక్ష్మి కిచ్చి తరువాత నీ కిమ్మనమన్నాను; అదీ నూతి దగ్గరే వుంది కదా!"

"దాన్ని పిలవండీ! ఇంత అయోమయం మనుషులేమిటే; లక్ష్మీ!" ఆదుర్దాగా పిలిచింది సావిత్రమ్మ.

"నేను ఉమకి ఇమ్మనమని ఇచ్చిన ఉంగరం ఎవరికిచ్చావు?" లోపలికి వస్తున్న లక్ష్మిని అడిగింది అరుణ.

"నా కోసం ఎవరో వచ్చారంటే, బయటకు వెడుతూ కరుణకిచ్చాను" అంది లక్ష్మి.

ఈ మాటల గందరగోళానికి ప్రక్క గదిలోంచి లోపలికి వచ్చిన కరుణ, "నేను మళ్ళీ మీ ఎవరి చేతికో ఇచ్చేశాను" అంది అయోమయంగా.

"ఎవరికిచ్చావే! మతిమరుపుదానా! ఇంత నిర్లక్ష్యమయితే ఎలానే! గుర్తుతెచ్చుకో ఎక్కడ పెట్టావో!" కోపంగా మందలించింది సావిత్రమ్మ.

"ఉండవే, గొడవ. లక్ష్మి అక్క నా చేతికిచ్చింది. నేను అదేమిటో కూడా సరిగ్గా చూడలేదు. యథాలాపంగా తీసుకున్నాను. తర్వాత అది ఎవరికిచ్చానో, ఎక్కడ పెట్టానో గుర్తురావడంలేదు. మీ కెవ్వరికి ఇవ్వలేదా నేను" అందర్నీ చూస్తూ అడిగింది.

"ఇస్తే, నిన్ను అడగడం దేనికి? వెతుకు ఎక్కడ పెట్టావో" గద్దించింది సావిత్రమ్మ. "ఛ..ఛ.. మన శ్శాంతి లేకుండా చేస్తారు. ఇంకా నయం, మగవాళ్ళెవరు లేరు. వాళ్ళొచ్చేసరికయినా దొరికితే బావుండు" అని వంట గదిలోకి వెడుతూ, "ఎంత ప్రేమతో ఇస్తే ఏం? పెట్టుకునే భాగ్యం, నిలబెట్టుకునే యోగం వుండొద్దు!" స్వగతంగా అన్నట్టుగా పైకే అంది.

సావిత్రమ్మకి బాధగా వుంది. ఇదేదో అపశకునంలా తోచింది. సావిత్రమ్మ పెళ్ళయిన తరువాత మొదటి శ్రావణ శుక్రవారంనాడు పూజ అయిన తరువాత అత్తగారు తన చేతి ఉంగరం తీసి "దీనిని నీ వేలికి పెట్టుకో, జాగ్రత్తగా వుంచుకో. మా అత్తగారు చని పోయే ముందు నా కిది ఇచ్చారు" అని చెప్పి ఇచ్చారు.

అప్పటి నుంచి దానిని వేలి నుంచి తియ్యకుండా జాగ్రత్తగా చూసుకుంటూ వచ్చింది. కొడుక్కి పెళ్ళయింది. తన అత్తగారు తనకిచ్చినట్టుగానే ఎరుపు రాయితో మెరిసిపోయే ఉంగరాన్ని కోడలికిచ్చింది సావిత్రమ్మ. ఇచ్చిన మూడవ రోజునే ఈ ఘోరం జరిగింది. కూతుళ్ళూ, కోడలూఅందరూ కలిసి వెతుకుతున్నారు. ఏమయివుంటుంది? కోపం వస్తోంది సావిత్రమ్మకి. కానీ ఎవరిని నిందించి ఏం లాభం? దేవుడి గదిలోకి వెళ్ళి నమస్కారం చేస్తూ, "తల్లీ! జగదాంబా తరతరాలుగా వస్తున్న ఆ ఉంగరం పోకుండా చూడు తల్లీ. అది దొరికితే, మహాలక్ష్మమ్మవారి గుళ్ళో అయిదు కొబ్బరికాయలు కొడతాను" అని దణ్ణం పెట్టుకుంది.

ఉమకి కళ్ళంట నీళ్ళు తిరుగుతున్నాయి. అత్తగారు అన్నమాటే గుర్తొస్తోంది. అనవసరంగా వదినగారు ఇచ్చినప్పుడు తీసుకోకుండా 'వుంచండి' అన్నాను. అప్పుడే తీసుకుని వుంటే బావుండేది. ఇప్పుడు ఇది దొరక్కపోయిందంటే, జీవితాంతం మాట పడాలి. అయినా ఇన్నాళ్ళ నుంచీ వస్తున్న ఆ ఉంగరం నా చేతికి ఇవ్వగానే పోయిందంటే... ప్చ్! భగవంతుడే కాపాడాలి. మొన్న గుళ్ళో పూజ చేయిస్తున్నప్పటి లక్ష్మి అమ్మవారు కళ్ళముందు మెదిలింది.

"తల్లీ! ఈ నింద నా మీదకు రాకుండా అది దొరికేటట్టు కరుణించు తల్లీ! ఇది దొరికిన వెంటనే అయిదు కొబ్బరికాయలు నీకు సమర్పించుకుంటాను!" అని మనస్సులో మొక్కుకుంటూ, నూతి గట్టు చుట్టూ వెతుకుతోంది.

నూతి చప్టా నుంచి మొక్కలకు నీళ్ళు తీసుకువెళ్ళే కాలవలను చేతులతో వెదుకుతూ, "ఛ, ఛ, నా పరధ్యానం వల్లే ఇది అంతా జరిగింది. నూతిగట్టు మీదో, అరుగుమీదో పెట్టినట్టున్నాను. అది కాస్త పోయింది. అమ్మతిట్లు సరే! వదిన ఏమనుకుంటుంది! నా వల్లే తనకు చెందవలసిన ఉంగరం పోయింది అనుకోదూ!" అమ్మా! మహాలక్ష్మి తల్లీ! ఈ ఉంగరం దొరికేటట్టు చూడు తల్లి. నీకు అయిదు కొబ్బరికాయలు చెల్లించుకుంటాను అనుకుంది కరుణ.

అమ్మ, వదినకు ఉంగరం ఇచ్చింది అని చెప్పగానే 'ఏదీ! ఇలా తీసుకురా, చూస్తాను" అని ఆయన అన్నారు కదా అని ఉమ వేలి నుంచి తీసుకువెళ్ళాను. మళ్ళీ తెచ్చి

ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 6-2-90

ఇవ్వగానే తీసుకోకుండా 'నిక్కు'పోయింది. అనవసరంగా - నా మూలంగా తన వేలి నుంచి తీసినట్టు అయింది. ప్చ్!

"దేవీ! జగన్మాత! మా ఇంటి ఇలవేల్పువి. నన్ను రక్షించు. ఆ ఉంగరం దొరికేటట్టు కరుణించు మాతా! సాయంత్రం నీకు అయిదు కొబ్బరికాయలు సమర్పించుకుంటాను" అనుకుంది అరుణ పెరడంతా అంగుళం, అంగుళం వెదుకుతూ.

లక్ష్మి అలమరలు, గూళ్ళు వెతుకుతూ 'సాయంత్రం దర్శనం చేసుకుంటాను ఉంగరం దొరికితే' అని లక్ష్మి దేవికి మొక్కుకుంది.

అందరూ తలోరకంగా ఆలోచిస్తూ, ఆందోళన మనస్కులై వెదుకుతున్నారు.

'అమ్మా! ఇలారా!' అరుణ కూతురు నాలుగేళ్ళ పిల్ల గట్టిగా పిలుస్తోంది.

'నోరు ముయ్యవే! వెధవ సొద!' విసుక్కుంది నెళ్ళకుండానే.

తొందర తొందరగా పిలవడంతో అందరూ వీధి వైపుకు వచ్చారు. "అమ్మా! చూడు కాకి ఏదో తింటోంది" అంటూ చూపించింది. అందరూ అటు చూశారు. వీధి ప్రహరీ గోడ మీద కాలికింద నొక్కిపట్టి ముక్కుతో దేన్నో పొడుస్తున్న కాకి అందర్నీ చూసి నోట కరచుకుంది ఆ వస్తువుని. అది చూడగానే అందరి కళ్ళు మెరిశాయి. కాని, కాకి ఎగిరిపోతుందేమోనని ఊపిరి బిగపట్టుకుని నిలబడ్డారు. రెండు గంతులు వేసి, అక్కడ కింద పెట్టి అటు, ఇటు చూస్తోంది. అదే అదనుగా కరుణ 'ఉష్!' అని అంటూ అటు ఉరికింది. కాకి ఎగిరిపోయింది. ఒక్క గంతులో ఉంగరాన్ని అందుకుని వదిన చేతిలో పెట్టింది. అందరూ తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నారు.

* * *

ఉమకి పెద్దగా దేవుడూ మొక్కులూ అన్నా నమ్మకం లేకపోయినా ఆ పరిస్థితిలో అంతకు మించి మార్గంలేక దేవునిపై భారం వేసింది. సాయంత్రం గుడికని చెప్పకుండా బయల్దేరి కొబ్బరికాయలు తీసుకుని గుడికి వెళ్ళింది. పూజ జరుగుతుండగా, సావిత్రమ్మ, తరువాత అరుణ, తరువాత కరుణ, లక్ష్మి ఒకరికి తెలియకుండా ఒకరు గుడికి వచ్చారు. ఒకళ్ళని చూసి ఒకళ్ళు ఆశ్చర్యపోయారు. 'ఆ ఉంగరం గురించి అందరూ అంత ఆందోళనపడ్డారా' అనుకుంది ఉమ. "నిజంగా తనెంత అదృష్టవంతురాలు! ఆప్యాయతకు మారుపేరయిన ఇంట్లో తను సభ్యురాలయింది. ఒక విధంగా ఈ ఉంగరం పోయి, దొరకడం మంచిదే అయింది. ఈ సంఘటన ద్వారా ఈ ఇంట్లో ఒకరంటే ఒకరికి ఎంత అనురాగమో, అభిమానమో తేటతెల్లమయింది" అనుకుంది సంతోష మనస్కురాలై ఉమ.

సావిత్రమ్మ కోడలు వంక ఆదరంగా చూసింది. "పిల్ల బుద్ధిమంతురాలే! వచ్చి కొద్ది రోజులే అయినా, తమతో కలిసిపోవడమేకాక, తమ ఇలవేల్పుకి మొక్కులు కూడా చెల్లిస్తోంది' అనుకుని ఆనందపడింది.


# ఆంధ్రజ్యోతి
## సచిత్ర వారపత్రిక

# తెలుగు కళాసమితి, న్యూజెర్సీ
## సంయుక్త ఆధ్వర్యంలో

# చిన్న కథలు - వ్యంగ్య చిత్రాల పోటీ

## 5,400 రూపాయిల బహుమతులు

క్రిందటి సంవత్సరం నిర్వహించినట్లుగానే ఈ ఏడాది కూడా అమెరికాలోని తెలుగు వారు ఆంధ్రజ్యోతి సచిత్ర వార పత్రిక ద్వారా చిన్న కథ, కార్టూన్ విభాగాల్లో పోటీలు నిర్వహించ తలపెట్టారు.

### కథలు

ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు పొందిన కథలకు వరుసగా రు. 1000, రు. 700, రు. 400 బహుమతులుగా వుంటాయి. ఇవి కాక ఒక్క కథకు రు. 300 బహుమతి చొప్పున ఆరు కథలను, రు. 150 బహుమతి చొప్పున ఆరు కథలను సాధారణ ప్రచురణకు ఎంపిక చేస్తాము.

### నిబంధనలు

తెలుగు వారి జీవిత చిత్రణ లక్ష్యంగా మీరుపంపే కథలు అమెరికాలోని ఆంధ్రులకు అర్థమయ్యేలా సులభ శైలిలో, సరళమైన భాషలో వుండాలి.

* వ్రాతలో కథ మూడున్నర ఠావులు మించరాదు.

* అనువాద కథలు, అనుకరిస్తూ చేసిన రచనలు స్వీకరించడం జరుగదు కనుక— రచయితలు తమ రచన(లు) అనువాదం, అనుసరణ కావని స్పష్టంగా పేర్కొంటూ పత్రాన్ని జతపరచాలి.

* ఒకరు ఎన్ని రచనలైనా పంపవచ్చు.

* కలం పేరు అచ్చులో వినియోగించేందుకు మాత్రమే పరిమితం. రచనతో పాటు పూర్తి చిరునామా విధిగా వుండాలి.

* ప్రచురణకు అంగీకరించని రచనలను తిప్పి పంపడం సాధ్యపడదు కనుక, స్టాంపులు అంటించిన కవర్లు జత చెయ్యనవసరం లేదు.

* బహుమతి రచనల గురించి, సాధారణ ప్రచురణల గురించి తుది నిర్ణయం సంపాదక వర్గానిదే.

* బహుమతి పొందిన కథలు, సాధారణ ప్రచురణకు ఎంచిన కథలు ముందుగా ఆంధ్రజ్యోతి సచిత్ర వార పత్రికలో అచ్చయి, ఆ తరువాత న్యూజెర్సీ తెలుగు కళాసమితి వారి మాస పత్రిక 'తెలుగు జ్యోతి'లో నెల కొకటి చొప్పున ప్రచురితమౌతాయి. కార్టూన్ల ప్రచురణకు కూడా యిదే పద్ధతిని అనుసరిస్తాము.

* ఎంపికైన రచనలకు, బహుమతి కథలకు, బహుమతిపొందిన కార్టూన్లకు పారితోషికం అందజేస్తున్నది న్యూజెర్సీ తెలుగు కళాసమితి

### కార్టూన్ విభాగం

* 'క్యాప్షన్' లేని కార్టూన్లకు ప్రాధాన్యత వుంటుంది.

* ఒక్కో కార్టూన్‌కు రు. 75 బహుమతి చొప్పున ఈ పోటీలో మొత్తం 8 కార్టూన్లను ఎంపిక చేస్తాము.

**కథలు కార్టూన్లకు గడువు తేదీమార్చి 5**

—ఎడిటర్

చిరునామా: తెలుగు కళాసమితి, న్యూజెర్సీ వారి కథల పోటీ

ఆంధ్రజ్యోతి సచిత్ర వార పత్రిక, పోస్ట్ బాక్స్ నెం 712, లబ్బీపేట, విజయవాడ— 520 010.